

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 275 శనివారం, నవంబర్ 07, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !



(కరీంనగర్, సాక్షర): రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. పూర్తిగా 3 లో

భారీగా తగ్గిన కామన్ పాస్ లు



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉద్దేశించిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమలులోకి రానున్నాయి.తాజా నిర్ణయంతో గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ కామన్ పాస్ ధర ఇప్పుడు రూ. 4,000కి తగ్గింది. ఇందులో రూ. 3,000 మెట్రోకు, రూ. 1,000 టీజీఎస్ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్‌తో నెలలో 50 రౌండ్ ట్రిప్పులు చేసేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా రూ. 400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ. 275కి తగ్గించారు. ఇందులో రూ. 200 మెట్రోకు, రూ. 75 ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. పూర్తిగా 2 లో

భాగ్యనగర్ లో నీటి కష్టాలు



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. పూర్తిగా 3 లో

శరవేగంగా కుంభమేళ పనులు



(భోపాల్, సాక్షర): దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభమేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. మిగతా 3 లో

కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం..

• పిలిచినా రాని మంత్రి? అధిష్ఠానికి పీసీసీ చీఫ్ నివేదిక?



(హైదరాబాద్, సాక్షర): అధికార కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మధ్య తలెత్తిన వివాదం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతల వ్యవహారశైలిపై సమగ్ర నివేదిక రూపొందించి కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఢిల్లీలో జరిగిన వివాదంపై వివరణ ఇచ్చేందుకు గాంధీ భవన్‌కు రావాలని మహేశ్ కుమార్ గౌడ్ ఇద్దరు నేతలను ఆదేశించారు. గురువారం ఉదయం మంత్రితో, మధ్యాహ్నం ఎమ్మెల్యేతో విడివిడిగా సమావేశం కావాలని నిర్ణయించారు. 2 లో

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..

(హైదరాబాద్, సాక్షర): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. 3 లో

నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?

నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. 3 లో

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి. 2 లో

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం



(నల్గొండ, సాక్షర): నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి-రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదయింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. 2 లో

వరంగల్‌లో భారీగా కల్తీ కారం,



(వరంగల్, సాక్షర): నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని అధికారులు పట్టుకోగా, వీటి విలువ సుమారు రూ.5.92 లక్షలుగా అంచనా వేశారు. ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై అధికారులు చర్యలు చేపట్టారు.

కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్...

(బెంగళూరు, సాక్షర): కాఫీ షాపులను కొందరు తాత్కాలిక ఆఫీసులుగా మార్చుకుంటున్నారు. కస్టమర్లకు ఇది సౌకర్యంగా ఉన్నా కేఫ్ యజమానులకు తలనొప్పిగా మారుతోంది. బెంగళూరులో ఓ కేఫ్ యజమాని ఎదుర్కొంటున్న సమస్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేవలం రూ.150 కాఫీ ఆర్డర్ చేసి, గంటల తరబడి టేబుళ్లను ఆక్రమించుకుంటున్న కస్టమర్ల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారుబెంగళూరులోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి రూ 60 నుంచి 70 లక్షలు పెట్టుబడి పెట్టి కెఫె ప్రారంభించారు. వ్యాపారం ప్రారంభించిన కొద్ది రోజులకే ఓ సమస్య ఎదురైంది. అక్కడికి వచ్చే కస్టమర్లు కేవలం రూ.150 విలువైన ఒక కప్పు కాఫీ మాత్రమే ఆర్డర్ చేస్తున్నారు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌లు తెరిచి గంటల తరబడి అక్కడే కూర్చుంటున్నారు. కొన్నిసార్లు రోజంతా కూడా టేబుళ్లను ఆక్రమించుకుంటున్నారు.కేఫ్‌లోని టేబుళ్లన్నీ ఇలా గంటల తరబడి కస్టమర్లతో నిండిపోవడంతో కొత్తగా వచ్చే వారికి కూర్చోవడానికి స్థలం ఉండటం లేదు. దీంతో చాలా మంది కెఫెలోకి వచ్చి సీట్లు ఖాళీగా లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఒకవైపు కాఫీ ఆర్డర్ చేసిన కస్టమర్లను వెళ్లిపోవాలని చెప్పలేరు. అలా చెబితే వారు గూగుల్‌లో నెగెటివ్ రివ్యూ ఇచ్చే అవకాశం ఉంది. దానివల్ల కెఫెకు నష్టం కలుగుతుందని యజమాని ఆందోళన చెందుతున్నారు.ప్రముఖ కాఫీ చైన్లు స్టార్‌బక్స్, CCD, థర్డ్ వేవ్ లో కాఫీ, స్నాక్స్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కస్టమర్లు కేవలం కాఫీ, స్నాక్స్ కోసమే డబ్బులు చెల్లించడం లేదు అక్కడ కూర్చుని గంటల తరబడి గడిపే సమయానికి పరోక్షంగా చెల్లిస్తున్నారు. కెఫెలో కూర్చునే స్థలానికీ ఓ ధర ఉంటుంది.ఈ పోస్టు వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల సూచనలు చేస్తున్నారు. కెఫెలో ఎంతసేపు ఉంటే అన్ని గంటలకు కనీసం ఒక కాఫీ ఆర్డర్ చేయాలనే నిబంధన పెట్టాలని ఓ నెటిజన్ సూచించారు. కాఫీ అమ్మడం కంటే కెఫెలో గడిపే సమయానికి డబ్బులు వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలి. ఎక్కువ ధర చెల్లిస్తే మెరుగైన సీటింగ్, కాఫీ, స్నాక్స్ అందించవచ్చు అని మరికొందరు అన్నారు. పూర్తిగా 2 లో

ముఖ్యమంత్రి పర్యటన



• భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

(నారాయణపేట, సాక్షర): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా కోస్గి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోస్గి పట్టణంలో సర్ సి.వి. 3 లో

మొదటి పేజీ తరువాయి కనిపించని అధికార పార్టీ ప్రభావం

ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని CEO స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

మొదటి పేజీ తరువాయి ముఖ్యమంత్రి పర్యటన

రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, రాకపోకల మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర ప్రాంతాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలు సాగించే మార్గాల్లో రోడ్డు ఓపెనింగ్ పార్టీలను ఏర్పాటు చేసి, రహదారులపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా రూఫ్‌టాప్ సెంట్రీలు, రోప్ పార్టీలు, కీలక కూడళ్లు మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా బలగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లే మార్గాన్ని ముషిఫా బోర్డర్ వరకు స్వయంగా పరిశీలించి, మార్గమధ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. బందోబస్తు ముందస్తు ప్రణాళికతో సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎస్పీతో పాటు డీఎస్పీలు నల్లపు లింగయ్య, ఏ. మహేష్, కోస్గి సీఐ సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలి నడకన వచ్చి సీఎం రేవంత్ ను కలిసి..



(హైదరాబాద్, సాక్షర): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు కర్నూలు నుంచి హైదరాబాద్ కుబుక అభిమాని కాలినడకన వచ్చాడు. 350.మీ. కాలినడకన వచ్చి సాయన్న తన అభిమానాన్ని చాటుకున్నాడు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సాయన్న, అక్టోబర్ 29 న ఆదోని నుంచి బయలుదేరాడు. తొమ్మిది రోజుల పాదయాత్ర తరువాత శుక్రవారం హైదరాబాద్ చేరుకుని రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు.

మొదటి పేజీ తరువాయి కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం..

అయితే సమావేశానికి వస్తానని ముందుగా చెప్పిన దామోదర రాజనర్సింహ చివరి నిమిషంలో రాలేనని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అసహనానికి గురైన పీసీసీ చీఫ్.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో జరగాల్సిన భేటీని కూడా రద్దు చేసుకుని వెనుదిరిగినట్లు సమాచారం. పార్టీ పిలుపునకు ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై ఆయన ఆగ్రహంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ వివాదానికి సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి నియామకమే కారణమని ప్రచారం జరుగుతోంది. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తన స్వస్థలమైన నారాయణఖేడ్‌కు చెందిన నేతకు డీసీసీ అధ్యక్ష పదవి విషయంలో మద్దతు తెలిపినట్లు సమాచారం. పక్క జిల్లా ఎమ్మెల్యే అయి ఉండి తన జిల్లాలో రాజకీయ జోక్యం చేసుకోవడంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన 'చలో ఢిల్లీ' ర్యాలీ సందర్భంగా ఓ ప్రముఖ హోటల్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు ఎమ్మెల్యే వర్గం ఆరోపించింది. మంత్రి దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని ఆ వర్గం పేర్కొంది. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా గాంధీ భవన్‌లో సమావేశానికి మంత్రి హాజరుకాకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ పరిణామాలపై మహేశ్ కుమార్ గౌడ్ నివేదికను అధిష్టానానికి పంపనున్నట్లు సమాచారం.

మొదటి పేజీ తరువాయి నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?

రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది.నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు, ఎందుకు పారబోశారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాగు, సాగునీటికి ఉపయోగించే జలవనరుల్లో రసాయన వ్యర్థాలను పారబోయడం ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిసరాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి భాగ్యనగర్ లో నీటి కష్టాలు

నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది.హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్‌ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొదటి పేజీ తరువాయి భారీగా తగ్గిన కామన్ పాస్ లు

ఈ పాస్‌పై రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ధరలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిత్య ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలు ఎక్కువగా ప్రజా రవాణాను వినియోగించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.కాగా, మెట్రో, ఆర్టీసీ ప్రయాణాల కోసం ఒకే కార్డును వినియోగించే ఈ కామన్ పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రవేశపెట్టారు. అయితే, అప్పట్లో నిర్ణయించిన ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

మొదటి పేజీ తరువాయి అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో కన్నీరుమున్నీరవుతున్నారు. అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు

మొదటి పేజీ తరువాయి శరవేగంగా కుంభమేళ పనులు

వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

కల్తీపాలు ముఠా గుట్టురట్టు

(హైదరాబాద్, సాక్షర): ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పాల దందాను మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు బట్టబయలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై నిన్న రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేసి, భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు.పోచారం గ్రామానికి చెందిన ఆండే శ్రీశైలం (43) అనే వ్యక్తి తన ఇంట్లోనే రహస్యంగా ఈ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పాల పొడిలో నీళ్లు, ప్రమాదకరమైన రసాయనమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను కలిపి సింథటిక్ పాలను తయారు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ బృందం మెరుపుదాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుంది.ఘటనా స్థలం నుంచి 100 లీటర్ల కల్తీ పాలు, 35 కిలోల 'ధోల్‌పూర్' బ్రాండ్ పాలపొడి, ఒక లీటరు హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాలు కలపడం ఆరోగ్యానికి ప్రమాదకరం. ఇది క్రిమిసంహారకంగా కొన్ని పారిశ్రామిక, శుభ్రపరిచే అవసరాల్లో ఉపయోగించే రసాయనం. దీన్ని కలిపిన పాలు తాగితే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. కడుపులో మంట, నొప్పి, వాంతులు, విరేచనాలు రావచ్చు. అధిక మోతాదులో రసాయనం చేరితే కడుపు, పేగుల లోపలి పొర దెబ్బతినే ప్రమాదం ఉంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ మోతాదు, గాఢత ఎక్కువగా ఉంటే అంతర్గత గాయాలు, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. తీవ్రమైన సందర్భాల్లో రక్తనాళాల్లో ఆక్సిజన్ బుడగలు ఏర్పడి రక్తప్రసరణకు ఆటంకం కలిగించే గ్యాస్ ఎంబాలిజం సంభవించవచ్చు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అనుమానాస్పద పాలను తాగడం కంటే అసలు పాలు లేదా టీ తాగకుండా ఉండటమే ఉత్తమం. శ్రీశైలంపై కేసు నమోదు చేసి, ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ కల్తీ పాల సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్

- కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

(జనగామ, సాక్షర): తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ వుంటుందని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, సొంత పార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మరణిస్తే కనీసం పట్టించుకోని బీఆర్ఎస్, అలాంటిది ఉద్యమ పార్టీ అని చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు. బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్ గౌడ్ . బీఆర్ఎస్ పార్టీ కోసం అప్పు చేసి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అప్పులు తీర్చలేక, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి సహాయం అందకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అయన అందజేసారు. ఎన్నికల్లో లక్ష్మణ్ గౌడ్‌ను వాడుకుని లబ్ధిపోంది, నేడు కనీసం ఆయన కుటుంబాన్ని కూడా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించలేదని అయన విమర్శించారు.

పారిశుధ్య పనులపై కమిషనర్ తనిఖీ



(నంద్యాల నవంబర్ 06, సాక్షర): పట్టణంలో పారిశుధ్య పనులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం నంద్యాల పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీధులు, రహదారులు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పారిశుధ్య పనుల్లో నాణ్యత పెంచి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, పారిశుధ్య పర్యవేక్షకులు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు బాలికను పరామర్శించిన మంత్రి సవిత



(బెంగళూరు, సాక్షర): బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికను మంత్రి సవిత పరామర్శించారు,. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలికకు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమై ప్రస్తుతం ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. చిన్నారి త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, బాలికకు అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం నుంచి బెంగళూరుకు గ్రీన్ ఛానల్ ద్వారా వేగంగా తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం ఫిట్‌కాప్

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఫిట్‌కాప్ (FitCop) కార్యక్రమాన్ని, రాష్ట్ర పోలీస్‌లోని అన్ని విభాగాలు, యూనిట్లకు విస్తరించేందుకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, చర్యలు చేపట్టారు.ఈ నేపథ్యంలో యాప్ డెవలపర్లు, టెక్నికల్ టీం, ఉన్నతాధికారులతో డీజీపీ సమావేశమై యాప్‌లో పొందుపరచాల్సిన ఆరోగ్య ప్రమాణాలు, అవసరమైన ఫీచర్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి రానున్న పదేళ్ల పాటు పూర్తి ఆర్థిక సహకారం అందించేందుకు స్పాన్సర్ ముందుకు వచ్చారు. అనంతరం అవగాహన ఒప్పందం (MoU), యాప్ ప్రారంభం తర్వాత అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. రానున్న 40–45 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణ పోలీస్‌లోని మొత్తం 90,000 మంది సిబ్బందికి బీఎంఐ, ఎత్తు, బరువు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేయనున్నారు. అధిక ఆరోగ్య ముప్పు ఉన్న సిబ్బందిని గుర్తించి, కాల్ సెంటర్ ద్వారా వైద్యులు ఫోన్ చేసి అవసరమైన వైద్య సూచనలు అందిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో మానసిక ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత ఆహార ప్రణాళికలు, వ్యాయామ సూచనలు, సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు.కేవలం ఆరోగ్యాన్ని పర్యవేక్షించడమే కాకుండా, ప్రతి పోలీస్ సిబ్బంది ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని మరింత మెరుగ్గా విధులు నిర్వహించేలా చేయడమే ఫిట్‌కాప్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డీజీపీ పేర్కొన్నారు.

టీపీసీసీ కంట్రోల్ చేయలేకపోతున్నారే...

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పిసిసి పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్స్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు. సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.పిసిసి చీఫ్ కనబరుస్తున్న ఈ బలహీనమైన వైఖరిపై పార్టీలోని ఒక బలమైన వర్గం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక నుంచి ప్రభుత్వం-పార్టీ సమన్వయం వరకు ప్రతి విషయంలోనూ మహేష్ గౌడ్ దిగువ స్థాయి ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని, అధిష్టానంతో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలు క్షేత్రస్థాయిలో దూకుడు పెంచుతుంటే, పీసీసీ అధ్యక్షుడు మాత్రం పార్టీలోని వ్యతిరేకత స్వరాలను అదుపు చేయలేక చేతులెత్తేయడం ప్రభుత్వ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.సొంత నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు, మంత్రివర్గ సభ్యులు-ఎమ్మెల్యేల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారినా పీసీసీ స్పందించకపోవడం రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. క్రమశిక్షణ విధింపులో జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం అనే ముసుగులో పార్టీ కట్టుబాట్లు పూర్తిగా కూలిపోతాయని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పీసీసీ చీఫ్ తన శైలిని మార్చుకుని ఉక్కుపాదం మోపకపోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఆధిపత్య పోరు కాస్తా నియంత్రించలేని దావానలంగా మారుతుందన్న అసంతృప్తి కనిపిస్తోంది.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు సీటు

(చీరాల, సాక్షర): ఏపీలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు ముగిసాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో 1వ తేదీన పోలింగ్ ముగియగా, నవంబర్ 3న ఫలితాలు వెలువడ్డాయి. అయితే ఆ రోజు తుపాను ప్రభావంతో చీరాలలో భారీ వర్షం కురవడంతో కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం వాయిదా వేసింది. దాంతో తాజాగా నేడు అక్కడ ఓట్ల లెక్కింపు చేపట్టారు.ఈ కౌంటింగ్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ తొలి విజయాన్ని అందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీలు, వైసీపీల మధ్య హోరాహోరీ పోరు సాగుతుండగా.. కాంగ్రెస్ పార్టీ చీరాల మున్సిపాలిటీలో ఖాతా తెరిచింది. చీరాల 25వ వార్డు నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు ఘన విజయం సాధించారు.ఈ 25వ వార్డులో బీజేపీ అభ్యర్థి రెండో స్థానంలో, వైసీపీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఇక 22వ వార్డును టీడీపీ అభ్యర్థి కైవసం చేసుకోగా, అక్కడ కాంగ్రెస్ రెండో స్థానంలో, వైసీపీ మూడో స్థానంలో నిలిచాయి

ఓలా, ఉబర్ లకు దీటుగా విన్ గ్రూప్

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాన్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉదాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి.జరుపుకోండి

- కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ సూచన

(హైదరాబాద్, సాక్షర): ఈ నెల 8వ తేదీన దీపావళి రోజున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అంత ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ చేసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో గతంలో ఎన్నడూ లేని విదంగా పేదలకు కొత్త ఇల్లు ఇవ్వడం జరిగింది ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే సందర్భం .. ఈ ఆనందాన్ని వారితో పంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల కల నెరిన సమయంలో వారితో దీపావళి జరుపుకోవాలని కోరుతున్నాము. గ్రామాల్లో రెండు దఫాలలో ఇల్లు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ లక్ష ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని ఇళ్లలో గృహ ప్రవేశాలు.కూడా జరిగాయి..ఇది నభూతో న భవిష్యత్ ఇలాంటి పండుగను మనం ఘనంగా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకోవాలని.విజ్ఞప్తి చేస్తున్నానని అయన అన్నారు.

మొదటి పేజీ తరువాయి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..

ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు.ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు.ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. దక్షిణం వైపు స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రాకపోకల విభాగాలు, ప్రయాణికుల రాక, బయలుదేరే ప్రాంతాల నిర్మాణం పూర్తయింది. దక్షిణం వైపు బేస్‌మెంట్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైలు, మెట్రో, రోడ్డు రవాణా మధ్య అనుసంధానం మరింత మెరుగుపడటంతోపాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి లభించనుంది.

మొదటి పేజీ తరువాయి మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి.అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి.ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త జోష్ వస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై, వైఫల్యాలపై పోరాటాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడం ద్వారా పార్టీ సామాజిక వర్గాల సమీకరణలోనూ బలపడే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.మొత్తానికి రాబోయే స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ హైకమాండ్ తీసుకునే ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది

మొదటి పేజీ తరువాయి కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్...

కొన్ని కేఫెలలో ల్యాప్‌టాప్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. కస్టమర్లు చేసే ఖర్చును బట్టి కెఫెలో ఉండే సమయాన్ని నిర్ణయించాలి. రూ.150 నుంచి రూ.750 వరకు బిల్లు ఉంటే గరిష్ఠంగా గంటన్నర, రూ.750 నుంచి రూ 1,500 వరకు బిల్లు ఉంటే రెండు గంటల సమయం ఇవ్వొచ్చు. వారంలో ఉదయం వేళల్లో ల్యాప్‌టాప్‌లతో పని చేసేందుకు అనుమతించి, సాయంత్రాలు, వారాంతాల్లో మాత్రం ఆంక్షలు విధించాలని మరో నెటిజన్ సూచించారు. మొత్తానికి కేఫెలలో కూర్చుని పని చేసేవారి సౌకర్యం ఒకవైపు వ్యాపార నిర్వహణ మరోవైపు ఈ రెండింటి మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్న ఇప్పుడు చర్చకు దారితీసింది. కస్టమర్లకు స్వేచ్ఛ ఉండాలా? కెఫె యజమానులు సమయ పరిమితులు విధించాలా అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి



- – రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం గరిష్ట స్థాయికి చేరాలి
- మార్చి నెలాఖరు నాటికి VBGRAMG ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం
- వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పనితీరును మెరుగుపరచాలి
- విద్య శాఖ పని తీరు, ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీటి సరఫరా, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని, విద్య, VBGRAMG పథకం, చేయూత పింఛన్ల పరిశీలన ప్రక్రియ, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శుక్రవారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని సీఎస్ సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్టంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్, VBGRAMG పథకాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. అన్ని పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలు అన్ని పాఠశాలల్లో నాణ్యతతో అమలయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీల్లో జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు.జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు, తదితర తాగునీటి మౌలిక సదుపాయాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సరఫరాలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.VBGRAMG పథకం అమలుపై మాట్లాడుతూ.. నవంబర్ నెలలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలు పనులు పొందుతున్నారని తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో నవంబర్ నెలలో సగటున 25 వేల మందికి మాత్రమే పనులు కల్పించగా, ప్రస్తుతం రోజుకు దాదాపు 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. VBGRAMG ద్వారా చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అవసరమైన కొత్త సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించి, తగిన హ్యాష్‌ట్యాగ్‌లతో ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారుడికి రూ.100 ప్రయోజనం కలుగుతుందని, మొత్తం సుమారు రూ.50 వేల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని తెలిపారు. సబ్సిడీ సిమెంట్ బస్తాల ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనం పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇళ్ల నిర్మాణాల పురోగతిని వేగవంతం చేసేందుకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతి వారం సమీక్ష ద్వారా నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వారం ఒక్కో ఏఈకి 20 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను పైకప్పు స్థాయికి తీసుకువచ్చేలా లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేకంగా అంతర్గత డ్యాష్ బోర్డును రూపొందించి, దాని ద్వారా ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

కారు జోరు.. బీఆర్ఎస్ లో భారీగా చేరికలు



(లక్ష్మణచందా, సాక్షర): మండలంలోని వడ్యాల్ తండా వార్డు సభ్యులు, గ్రామస్తులు, పలువురు యువకులు శుక్రవారం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ రామ్ కిషన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు జహీరుద్దీన్, బుర్రి భూమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ నాయకులు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ నాయకులు బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలియజేశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.కొత్తగా చేరిన వారు, వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం, యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ తో కలిసి పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ మండల పరిషత్ సమీక్షలో ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



(ఆదిలాబాద్ రూరల్, సాక్షర): ఆదిలాబాద్ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలపై అధికారులతో సమీక్షించి పలు అంశాలపై చర్చించారు.సమావేశంలో డీపీఓ రమేష్, ఎంపిడివో వంశీ కృష్ణ, ఎంఈవో రమేష్ రెడ్డి, ఎంపిఓ సత్య ఆనంద్, తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై ఉక్కు పాదం



- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అర్ధరాత్రి ఆకస్మికంగా రౌడీ షీటర్ల పరిశీలన

(ఆదిలాబాద్, సాక్షర): జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడం, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా రక్షించడం పోలీసుల బాధ్యతగా అర్ధరాత్రి ఆకస్మికంగా రౌడీ షీటర్ల తనిఖీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చేపట్టారు.గురువారం అర్ధరాత్రి 11 గంటల నుంచి 12 గంటల సమయంలో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లను, పూరవీధులను సందర్శిస్తూ, ప్రజలకు సమస్యలు తెచ్చే రౌడీషీటర్ల ఇళ్లను తనిఖీ చేయడం జరిగింది.ఇంట్లోనే ఉన్న రౌడీలను పరిశీలించి వారి నేరచరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు.ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సన్మార్గంలో ప్రయాణించాలని, తిరిగి నేరాలు చేయాలనే ఆలోచన వస్తే జైలు తప్పదని హెచ్చరించారు.పట్టణంలోని కొలిపుర, రవీంద్ర నగర్, చిలుకూరి లక్ష్మీ నగర్ లలో గల రౌడీషీటర్ ఇళ్లను పరిశీలించి వారిని తనిఖీ చేయడం జరిగింది. పట్టణంలో సంచరిస్తున్న వారిని తనిఖీ చేసి మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వారి వాహనాలను జప్తు చేయడం జరిగింది. అర్ధరాత్రి రోడ్లపై తిరిగే వారిని కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, సిబ్బంది, ఎస్ఐ నాగనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతో పాలనా వ్యవస్థపై సమగ్ర అవగాహన పొందాలి

- ట్రైనీ అఖిల భారత సర్వీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): జిల్లాలో ఆరు రోజులపాటు కొనసాగిన అఖిల భారత సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ట్రైనీ అధికారులకు పలు సూచనలు చేశారు.ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఓఎస్ తదితర అఖిల భారత సర్వీస్ లకు చెందిన 18 మంది ట్రైనీ అధికారులను ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించారు. అక్టోబర్ 31న జిల్లాకు చేరుకున్న వీరు నవంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా విద్య, వైద్యం, ఉపాధి, ఆసుపత్రులు, ఐసీడీఎస్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సేవల అమలుపై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ప్రజల జీవన విధానం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పాలనా వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర అవగాహన పొందాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, ట్రైనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్కూల్ లో ఫుడ్ ఫెస్టివల్



- హాజరైన డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్

(ఆదిలాబాద్ టౌన్, సాక్షర) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాస్ నగర్ లో, విజయ డైరీ సమీపంలో ఉన్న దివ్యాంగుల విజ్ఞాన్ స్పెషల్ స్కూల్ లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల స్టాళ్లను ఆయన సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. వారు స్వయంగా తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలించి, వారి ప్రతిభను, సృజనాత్మకతను, చొరవను ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, దివ్యాంగులైన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక స్పృహ, సృజనాత్మకత, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారిని జాలితో కాకుండా ప్రోత్సాహంతో, గౌరవంతో చూడాలని అన్నారు. సరైన ప్రోత్సాహం, మంచి విద్య, తగిన అవకాశాలు కల్పిస్తే దివ్యాంగ విద్యార్థులు సైతం అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని ప్రోత్సహించే విధంగా ఫుడ్ ఫెస్టివల్ వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని, ప్రిన్సిపాల్ ను డా. నరేష్ జాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్లో కరువు పరిస్థితులపై సీపీఐ పర్యటన



- ఎకరానికి లక్ష రూపాయల పంట నష్టపరిహారం ఇవ్వాలి ముడుపు ప్రభాకర్ రెడ్డి

(భీంపూర్, సాక్షర) : భీంపూర్ మండలంలో శుక్రవారం కరువు పరిస్థితులను తెలుసుకోవడానికి సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా నాయకత్వం చేను చేనుకు తిరిగి గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించారు.రైతుల కరువు పరిస్థితులు, పంటల పరిస్థితులను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి, ప్రభుత్వంపై ఏ విధంగా పోరాటం చేయాలి అనే అంశాలపై చర్చించారు. రైతులకు కనీసం పంట నష్టపరిహారం ఎకరానికి ఒక లక్ష రూపాయలు, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న వారికి, 5 ఎకరాల పైగా ఉన్న వ్యవసాయ రైతుకు 60 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కనీసం ఎకరానికి 30,000 కౌలుకు, ఎకరం పత్తి పంటకు కనీసం 30 వేల రూపాయలు ఖర్చు, రెండు కలిపితే 60 వేల రూపాయలు ఎకరానికి నష్టం జరిగిందని, కాబట్టి దీనిని ప్రభుత్వమే జాతీయ విపత్తుగా తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి కరువును డిక్లేర్ చేసినప్పటికీ రెండు ప్రభుత్వాలు కలిసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. లేకపోతే తీవ్రమైన ఆందోళనకు సీపీఐ పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కుంటాల రాములు, అర్ధాంగి రమేష్, షేక్ పాషా, ఖండాల గణేష్, షేక్ సలీం, నాయిని గంగాధర్, ఆలుగంటి లక్ష్మన్న, పోల్కం విటల్, కొల్లూరు సంతన్న, మగ్గిడి ఆశన్న తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలకు పుట్టినిల్లు ఆదిలాబాద్ జిల్లా గిరిజన పల్లెలు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దండారి ఉత్సవాల్లో సంప్రదాయ నృత్యాలు చేసిన ఎమ్మెల్యే



(తలమడుగు, సాక్షర) : విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవు మన ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ పల్లెలు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు, కళలకు ఆదివాసీ గూడాలు పుట్టినిల్లుగా నిలుస్తున్నాయి.ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ఆదివాసీ పండుగగా పేరుగాంచిన దండారి (గుస్సాడి) ఉత్సవాలు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.తలమడుగు మండలంలోని పాల్సి-కె గ్రామంలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు నిర్వహించిన దండారి (గుస్సాడి) ఉత్సవాల్లో బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివాసీ కళాకారులతో కలిసి సంప్రదాయ దండారి నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, దండారి ఉత్సవాలు వారి ఐక్యతకు,కళా వైభవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని అన్నారు. ఇలాంటి గొప్ప సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడమే కాకుండా వాటి విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ గ్రామాల పటేలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దీపావళి పర్వదినం సందడి

- లక్ష్మీ పూజలకు వ్యాపారుల ఏర్పాట్లు నూతన ఖాతా పుస్తకాల కొనుగోలు



(నిజామాబాద్, ప్రతినిధి, సాక్షర) : దీపావళి పర్వదినం హిందువులందరికీ పెద్ద పండుగ అయితే వ్యాపార సంస్థలకు మాత్రం మరింత ప్రత్యేకమైనది.సాంప్రదాయబద్ధంగా వ్యాపారస్తులు దీపావళి పండుగ పురస్కరించుకొని తమ వ్యాపార సంస్థల్లో సాంప్రదాయంగా లక్ష్మీ పూజలు నిర్వహించి ప్రాంగణాల్లో భారీ ఎత్తున దీపాలు వెలిగించి పటాకులు కాల్చడం జరుగుతుంది.అందులో భాగంగానే తమ వ్యాపార సంస్థలకు సంబంధించి నూతన ఖాతా పుస్తకాలు ప్రారంభించడం కూడా ఒక ప్రధాన ఘట్టం. లక్ష్మీ పూజలు చేసిన రోజు వ్యాపారస్తులు తమ వ్యాపార సంస్థకు సంబంధించిన లావాదేవీల ఖాతా పుస్తకాలను ప్రారంభించడం జరుగుతుంది.శుక్రవారం నగరంలో గాంధీ చౌక్ మార్గంలో కొందరు వ్యాపారులు నూతన ఖాతా పుస్తకాలను కొనుగోలు చేయడంతో సందడిగా మారింది.ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ తాము ప్రత్యేక నూతన ఖాతా పుస్తకాలు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

మూడేళ్లలో ఎమ్మెల్యే ఫండ్ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు: ఎమ్మెల్యే ధన్ పాల్



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన మూడేళ్లలో ఎమ్మెల్యే ఫండ్ ద్వారా నిజామాబాద్ నగర అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ప్రస్తుతం కార్పొరేషన్ లో ఉన్న బడ్జెట్ తో పనులు ప్రారంభిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు.నగరంలోని 17, 19వ డివిజన్లలో శుక్రవారం రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్ కు 20 లక్షలు కేటాయించిన విషయం తెలిసిందేనన్నారు. ఇందూరులో బీజేపీ గెలిచిందని నిధులు కేటాయించడం లేదా అని ప్రశ్నించారు. నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఆ నిధులతో ప్రతి డివిజన్ లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఇందూరు అభివృద్ధిపై చర్చించానన్నారు.కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, చింతా ప్రసూన, పసునూరి రాము, మమత శివ, మాయావార్ సాయిలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గన్ని బ్యాగుల డబ్బులు విడుదల

- జిల్లా వ్యాప్తంగా రూ.11,44,081.95 విడుదల - పసుల చంటి



(ఆదిలాబాద్, సాక్షర) గత రబీ సీజన్ లో రైతులు మొక్కజొన్న అమ్మకాల సందర్భంగా సొంతంగా కొనుగోలు చేసిన గన్ని బ్యాగుల డబ్బులు విడుదలైనట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తెలిపారు.శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్ కు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందించారు.బోథ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బోథ్ మండలంలో 29,399 బ్యాగులకు గాను 6,50,011.89 రూపాయలు, సోనాల మండల పరిధిలో 12,152 బ్యాగులకు గాను 2,68,680.72 రూపాయలు, జిల్లా వ్యాప్తంగా 11,44,081.95 రూపాయలు విడుదలైనట్లు తెలిపారు.రైతులెవరు దళారుల మాయలో పడి తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవద్దని, రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని తెలిపారు. రెండు మూడు రోజుల్లో జొన్న పంటకు సంబంధించిన గన్ని బ్యాగుల డబ్బులు కూడా విడుదల అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒక్క ఎకరం అమ్మినట్టు నిరూపించినా ఊడిగం చేస్తా

• ప్రభుత్వానికి మాధవరం కృష్ణారావు సవాల్

(హైదరాబాద్, సాక్షర): కూకట్‌పల్లి భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. కూకట్‌పల్లిలో తాము ఒక్క ఎకరం భూమి అమ్మినట్లు నిరూపిస్తే, వారి ఇంట్లో ఊడిగం చేయడానికి సిద్ధమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము పోరాడి సాధించిన మియాపూర్ భూములపై కోర్టు ఆర్డర్ కాపీ రాకముందే ప్రభుత్వం వేలానికి సిద్ధమైందని మాధవరం ఆరోపించారు. హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను కూడా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని, ఇవన్నీ పేదలకు చెందినవని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తూ, ఆయనకు హైదరాబాద్ నగరంపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు."చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లు ఖర్చు పెడుతూ, మరోవైపు వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం ఎంతవరకు సమంజసం?" అని మాధవరం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలకు చెందిన భూముల అమ్మకం విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై తన పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

దాడువాయి యూనియన్ భవనాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని దాడువాయి యూనియన్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ గజానన్, కొనుగోలుదారుల సంఘం అధ్యక్షులు దినేష్ రెడ్డి, ఆర్తిదారుల సంఘం అధ్యక్షులు భూమా రెడ్డి, మునీమ్ సంఘం అధ్యక్షులు ఆశన్న, దాడువాయి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాయిని సుదర్శన్, ఏఎంసీ మెంబర్ పోశెట్టి, యూనియన్ కార్యవర్గ సభ్యులు గంగన్న, చారి తదితరులు పాల్గొన్నారు.

దండారి ఉత్సవాల్లో మాజీ ఎంపీ సోయం బాపూరావు



(నార్నూర్, సాక్షర): మండలంలోని గుంజల గ్రామంలో నిర్వహించిన ఆదివాసీల సంప్రదాయ పండుగైన దండారి ఉత్సవాల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు పాల్గొన్నారు.ముందుగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కళాకారులు సంప్రదాయ వేషధారణలో చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రతి దండారికి షెడ్డు నిర్మించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, దానిని కూడా సాధిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తొమ్మిది తెగల ఆదివాసీ జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ దొర, కొడప కోసేరావు, ఆదివాసీ కళాకారులు మెస్రం మేఘురాజ్, తానాజీ, పురుషోత్తం, మోహన్ రావు, కనక తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాలి

• ఐటీడీఏ పీఓ మంద మకరందు గుస్సాడీ దండారి ఉత్సవాల్లో పాల్గొని, సాంప్రదాయ నృత్యంలో భాగమైన ప్రాజెక్టు అధికారి

(గుడిహత్నూర్ , సాక్షర) : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని సోయం గూడా గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన గుస్సాడీ దండారి ఉత్సవాల్లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ గిరిజన ప్రజలు ప్రాజెక్టు అధికారికి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రాజెక్టు అధికారి నెమలి పించాన్ని ధరించి, గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన సాంస్కృతిక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం గుస్సాడీ దండారి ఉత్సవాల ప్రత్యేకతను, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను దగ్గరగా పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనుల సాంప్రదాయ కళలు, ఆచారాలు, పండుగలు మన వారసత్వ సంపదకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించడంతో పాటు వాటి ప్రాధాన్యతను మరింత విస్తృతంగా చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ప్రాజెక్టు అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ గిరిజన పెద్దలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


జామ్నిలో ఘనంగా దండారి వేడుకలు



• హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

(జైనూర్, సాక్షర): జైనూర్ మండలం జామ్ని గ్రామంలో ఆదివాసీల సంప్రదాయ పండుగ దండారి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి హాజరై, గ్రామస్తులతో కలిసి దండారి నృత్యంలో పాల్గొన్నారు. గోండు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా యువకులు, మహిళలు ప్రదర్శించిన దండారి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ పెద్దలు, ఆదివాసీ సంఘం నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే భేటీ



• ఆయా శాఖల వారిగా కొనసాగుతున్న పనులపై సుదీర్ఘంగా చర్చ

(నిజామాబాద్, సాక్షర): నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో భేటీ అయ్యారు. ఆయా శాఖల వారిగా కొనసాగుతున్న పనులపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రధానంగా ఆర్ అండ్ బీ, పబ్లిక్ హెల్త్, కార్పొరేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర ఉన్నతాధికారులతో ఆయా పనుల పురోగతి తెలుసుకున్నారు. అంగన్వాడీలో శాశ్వత భవనాలు, రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి రోడ్డు పనులు, కళాభారతి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థలసేకరణ తదితర అంశాలపై చర్చించడం జరిగింది.

దండారి ఉత్సవాల్లో సోయం బాపూరావు



(సాత్నాల, సాక్షర): మండలంలోని జమిని గ్రామంలో నిర్వహించిన ఆదివాసీల సంప్రదాయ పండుగైన దండారి ఉత్సవాల్లో మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు పాల్గొన్నారు.ముందుగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కళాకారులు సంప్రదాయ వేషధారణలో చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రతి దండారికి షెడ్డు నిర్మించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, దానిని కూడా సాధిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తొమ్మిది తెగల ఆదివాసీ జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ దొర, అడప కోశేరావు, తానాజీ, పురుషోత్తం, మోహన్ రావు, కనక తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం దీక్ష శిబిరానికి మద్దతు తెలిపిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు



• శిబిరంలో అన్నదాన కార్యక్రమం

(ఆదిలాబాద్, సాక్షర) : ఎన్‌హెచ్‌ఎం దీక్ష శిబిరానికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, 3194 జిల్లా నాయకుల సమక్షంలో శిబిరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నల్ల రవీందర్, సీనియర్ ఫార్మసిస్ట్ సచిన్ కనికె, సత్యనారాయణ దూలం, దారవేణి సంతోష్ కుమార్, జిల్లా నాయకులు జిల్లా అధ్యక్షులు ఆడే సురేష్, బొమ్మేత సుభాష్, తులసి రామ్ రాథోడ్, నగేష్, కష్టాల శ్రీనివాస్, 20 మంది సంఘ నాయకుల సహకారంతో 10,000 రూపాయలను ఎన్‌హెచ్‌ఎం శిబిరం వద్ద భోజనాల కార్యక్రమానికి ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్‌హెచ్‌ఎం వారి సమస్యల పట్ల రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా పక్షాన జిల్లాలోని నాయకులతో కలిసి ఎన్‌హెచ్‌ఎం లో ఉన్న ప్రతి సమస్యను రాష్ట్ర సంఘానికి తెలియజేస్తూ సమస్యల పరిష్కారానికి తమ పూర్తి మద్దతు, సహాయ సహకారాలను అందిస్తామని సభాముఖంగా తెలియజేశారు.అదేవిధంగా జిల్లా అధ్యక్షులు ఆడే సురేష్ కూడా ఎల్లవేళలా మేము రెగ్యులర్ ఉద్యోగులమైనప్పటికీ మీరు కూడా రేపటి రెగ్యులర్ ఉద్యోగులే అని, మీ సమస్యలను రాష్ట్ర కార్యవర్గానికి తెలియజేస్తూ మీ వెన్నంటి ఉంటామని తెలిపారు.సమస్యలు ఎన్నున్నా చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న మీ సమస్యలకు మేము కూడా సహాయపడతామని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం, 3194 ఉద్యోగుల జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి బొమ్మేత సుభాష్ తమ పూర్తి మద్దతును తెలియజేస్తూ ఉద్యోగుల బాధలను ఒక పాట రూపంలో రాసి దీక్ష శిబిరం వద్ద పాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ఉద్యోగ సంఘ నాయకులు డిపిఎం దేవిదాస్, అమర్నాథ్, శివ ప్రసాద్, గోపాల్, సురేందర్, శ్రీనివాస్, దత్తు, చిరంజీవి, మహిళా విభాగం నాయకులు రణిత, పుష్పలత, చంద్రరేఖ, ఆడేళ్ల, సంగీత, ఉజ్వల, రమాదేవి, విజయలక్ష్మి, లతా, ఆకాంక్ష, పూనమ్, శిబిరంలో ఉన్న వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగులందరూ పాల్గొని ఏర్పాటు చేసిన విందులో భాగస్వాములై సహపంక్తి భోజనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉద్యోగుల సంఘం నాయకులకు, ప్రతి ఉద్యోగికి, అన్నదానానికి సహకరించిన ప్రతి ఉద్యోగికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలి

• ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరీష్ తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నశా ముక్త్ భారత్ కార్యక్రమం



(తలమడుగు, సాక్షర): యువత సోషల్ మీడియా వ్యసనానికి దూరంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి సారించాలని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరీష్ అన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మై భారత్ యువ కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నశా ముక్త్ భారత్, దీపావళి స్నేహ మిలన్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ సూరజ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరీష్ మాట్లాడుతూ యువత సోషల్ మీడియా వ్యసనానికి దూరంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.మై భారత్ యువ కేంద్రం ప్రతినిధి రాము మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రిన్సిపాల్ సూరజ్ సింగ్ సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సెలర్ దినేష్ రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ పీఓ లింగన్న, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కిసాన్ మహారాజ్ అవార్డు గ్రహీత జంగుబాయికి ఘన సన్మానం



(ఉట్నూర్, సాక్షర): ఇటీవల కిసాన్ మహారాజ్ అవార్డు పొందిన ఉట్నూర్ మండలం తాటిగూడ గ్రామానికి చెందిన జంగుబాయిని ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు ఉట్నూర్ లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, సీపీఎఫ్ ఎన్జీఓ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

భవిష్యత్తు అవకాశాలపై రైతులకు శిక్షణ



(ఉట్నూర్, సాక్షర): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ , ఉట్నూర్ ఉద్యాన శాఖ, ఆదిలాబాద్ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం కింద శుక్రవారం పీఎంఆర్‌సీ సమావేశ మందిరం, కేబి కాంప్లెక్స్, ఉట్నూర్ లో "కూరగాయల్లో అంటుకట్టే విధానం - భవిష్యత్తు అవకాశాలు" అనే అంశంపై గిరిజన యువ రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ మంద మకరందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 70 మంది గిరిజన యువత పాల్గొన్నారు. వీరిలో ఆసక్తి కలిగిన 45 మంది గిరిజన ఆదివాసీ మహిళలకు కూరగాయల మొక్కల్లో అంటు కట్టటానికి వారం రోజులు హైదరాబాద్ లోని కన్హా శాంతివనంలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, గిరిజన యువత ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్చుకొని స్వయం ఉపాధి పొందాలని, కూరగాయల గ్రాఫ్టింగ్ వంటి నూతన సాంకేతికతతో తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఐటీడీఏ ద్వారా యువతకు అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి, జిల్లా ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ మాట్లాడుతూ, గ్రాఫ్టింగ్ వల్ల నేల ద్వారా వచ్చే తెగుళ్లు, వేరుకుళ్లు రావని, దిగుబడి 30శాతం - 40శాతం పెరుగుతుందని, కరువును తట్టుకునే శక్తి పెరుగుతుందని వివరించారు. టమాట, వంకాయ, దొండ, కాకరకాయ వంటి పంటలలో గ్రాఫ్టింగ్ చాలా లాభదాయకమని తెలిపారు.హైదరాబాద్ కన్హా శాంతివనం నుండి శివ, ఉద్యాన పరిశోధనా స్థానం, ఆదిలాబాద్ నుండి డా. మల్లేష్, గ్రాఫ్టింగ్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి, దాని ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, భవిష్యత్తులో గ్రాఫ్టింగ్ నర్సరీలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతామని పాల్గొన్న యువత ఐటీడీఏ కు, ప్రాజెక్టు అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది మహేందర్, భూమయ్య, అర్షిత, సీపీఎఫ్ ఎన్జీఓ సిబ్బంది సత్యనారాయణ, షారుక్, దిలీప్, న్యాను, పూజ, సుదర్శన్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో మారని తీరు

(హైదరాబాద్, సాక్షర): కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ఢిల్లీలో జరిగిన 'ఓట్ చోరీ' ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సస్పెన్షన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు. మరోవైపు ఈ అంతర్గత కుమ్ములాటల వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి


గిరిజన సంస్కృతికి ప్రతీక గుస్సాడి దండారి ఉత్సవాలు

- భావితరాలకు ఆదివాసీ సంస్కృతిని అందించాలి ఎస్పీ అఖిల్ మహాజన్



(సోనాల, సాక్షర) : ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ అన్నారు. గిరిజనుల విశిష్టమైన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సోనాల మండలం పార్డి బి గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి ఉత్సవాల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, గుస్సాడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వివిధ సంస్కృతులు, సంప్రదాయాలలో ఆదివాసీ సంస్కృతికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. గుస్సాడి దండారి వేడుకలు కేవలం పండుగ మాత్రమే కాకుండా గిరిజనుల ఐక్యత, సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఒక గ్రామానికి చెందిన దండారి బృందాలు మరో గ్రామానికి వెళ్లి ఉత్సవాల్లో పాల్గొనడం గిరిజనుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు పరిచయం చేయాలని సూచించారు. గ్రామస్థులంతా ఐకమత్యంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, ఈ గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పండుగలను సంప్రదాయబద్ధంగా, శాంతియుత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, గ్రామస్థులు, ఆదివాసీ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముడుపు మౌనిష్ రెడ్డి



(తలమడుగు, సాక్షర): మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన మెస్రం విలాస్ కుమారుడు మెస్రం ధనరాజ్ గ్రామ సమీపంలోని చెరువులో మునిగి చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆత్రం సులోచన, మాజీ సర్పంచ్ పెందూర్ రాంబాయి, పటేల్ మెస్రం నాగోరావ్, మహాజన్ పెందూర్ ప్రసాద్, ఆత్రం సూర్యభాన్, ఆత్రం సీతారామ్, పెందూర్ సంబు, ఆత్రం కృష్ణ, పెందూర్ మాధవరావు తదితరులు ఉన్నారు.

నూతన హార్డ్‌వేర్ షాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



(ఆసిఫాబాద్, సాక్షర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని నూతన హార్డ్‌వేర్ షాప్ ను ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, రాజంపేట ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సాయి శ్రవణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



(ఆదిలాబాద్, సాక్షర): ప్రతి నెల తనిఖీలో భాగంగా శుక్రవారం స్థానిక శాంతినగర్ లోని ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల గోదాంను జిల్లా కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి నలంద ప్రియ, నాయబ్ తహసీల్దార్ మధుసూదన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రక్షణ,ఉత్పత్తిలో మేటి ఖైరుగుర ఓపెన్ కాస్ట్

- ఏరియా జిఎం ఎం.శ్రీరమేష్



(రెబ్బెన,సాక్షర) : రక్షణ,ఉత్పత్తి లో మేటి ఖైరిగుర ఉపరితల గని అని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు.ఏరియా లోని ఖైరిగుర ఉపరితల గని 2024-25ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయిలో 5స్టార్ రేటింగ్ సాధించిన సందర్భంగా శుక్రవారం ఓసీ వద్ద సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిఎం అధికారులు,ఉద్యోగుల కృషిని కొనియాడారు.ఇప్పటి వరకు మైన్ కు వచ్చిన పతకాలు,జ్ఞాపిక లను ప్రదర్శించారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఖైరిగుర ఉపరితల గని ఉత్పత్తి పనితీరు,రక్షణ చర్యలు,నిర్వహణ సౌకర్యాలు పర్యావరణహిత చర్యలు,కార్మిక సంక్షేమం వంటి 84అంశాలలో జాతీయ స్థాయిలో ఇతర గనులతో పోటీ పడిందన్నారు.100 మార్కులకు గాను 91కి పైగా మార్కులతో 5స్టార్ రేటింగ్ సాధించడం గర్వకారణం అన్నారు.అవార్డు రావడంలో ప్రతి ఉద్యోగి కృషి ఉందన్నారు.అనంతరం అత్యవరసర సమయంలో ఉద్యోగికి సిపిఆర్ చేసే విధానాన్ని రెస్క్యూ సిబ్బంది చూపించారు.కార్యక్రమంలో ఏఐటియూసి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి,ఖైరిగుర పీఓ ఎం.నరేందర్,ఎస్ఓ టు జిఎం స్వామిరాజు,ఏరియా ఇంజనీర్ బి.వీరన్న,ప్రాజెక్ట్ మేనేజర్ జే.శంకర్ ఖైరిగూడ ఫిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్,ఇంచార్జి పిఈ ఎస్.రాజు,సేఫ్టీ అధికారి గౌతమ్ రాజేష్ రెడ్డి అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీ వాసులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) : పట్టణంలోని లెప్రసీ కాలనీ నివాసితులకు కేటాయించిన గృహ స్థలాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీలో గృహ స్థలాల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం కాలనీ వాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.గృహ స్థలాలకు సంబంధించిన సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాల నిర్మాణం త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.లెప్రసీ బాధితుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, వారు గౌరవప్రదమైన జీవనం సాగించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నివాసితులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు, అవసరమైన మందులు అందేలా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సర్వే సిబ్బంది, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

- నిబంధనల ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): జిల్లాలోని వివిధ క్వారీల నుండి నిబంధనలకు అనుగుణంగానే ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతోందని, ఈ విషయంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమలయ్యేలా చూడాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు అనుమతించినందున ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, మైనింగ్ అధికారి బాలు, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- గుడిహత్నూర్ లో మానవ హక్కుల అవగాహన



(గుడిహత్నూర్, సాక్షర) : ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ 0418 యూనిట్ ఆధ్వర్యంలో మానవ హక్కుల అవగాహన, ప్రజా సమస్యల నివేదికలో భాగంగా మండల సమగ్ర సర్వే 2026 నిర్వహించారు.ఈ సందర్భంగా గుడిహత్నూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీలను కలిసి గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఆంకతి సవిత రవిని కలిసి గ్రామంలోని సమస్యలు, మానవ హక్కుల పరిరక్షణ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏహెచ్ ఐఆర్ఏ 0418 కోఆర్డినేటర్ జాదవ్ కాంతారావు, 0418 యూనిట్ జిల్లా అధ్యక్షుడు మల్యాల శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్ షేక్ సౌకత్, జాయింట్ సెక్రటరీ టేకుల అశోక్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మావల మండల పరిషత్ సమీక్షలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



(మావల, సాక్షర): మావల మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నేడు జరిగింది. ఈ సమావేశానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలపై అధికారులతో సమీక్షించి పలు అంశాలపై చర్చించారు.సమావేశంలో మావల మండల ప్రత్యేక అధికారి మిల్కా, ఎంఈఓ సరోజ, ఎంపీఓ నందిని, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, బట్టిసావర్గాం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వాహపూర్ సర్పంచ్ దినేష్ తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్లో ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమంపై చర్చ



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై జిల్లా స్థాయి చర్చా సమావేశం విజయవంతంగా నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుస్సేన్ జిల్లాకు విచ్చేసి, ఫోటోగ్రాఫర్ల అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై విలువైన సూచనలు, సలహాలు అందించారు. ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం బలోపేతం, సభ్యుల ఐక్యత, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు మంచిర్యాల జిల్లా నాయకులు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె. సమీర్, వావిలాల రాజు, మండల అధ్యక్షులు సందీప్, వివేక్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు.జిల్లాలోని ఫోటోగ్రాఫర్లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఐకమత్యంతో సంఘ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించారు.

జనవరి 12 విడుదల' సినిమా కజకిస్థాన్ షెడ్యూల్ ప్రారంభం



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్ లో హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న మోస్ట్ అవైటెడ్ మల్టీస్టారర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫ్యామిలీ ఎమోషన్స్, హ్యూమర్, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కంప్లీట్ ప్యాకేజీగా అలరించనుంది. తాజాగా చిత్ర బృందం కజకిస్థాన్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించింది. ఈ షెడ్యూల్ కోసం దర్శకుడు అనిల్ రావిపూడి యాక్షన్, పాటల కలయికతో ప్రత్యేకమైన ప్లాన్ సిద్ధం చేశారు. ఇందులో హీరోలిద్దరితో రెండు ప్రధాన సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ రియల్ సతీష్ పర్యవేక్షణలో వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఈ రోజు ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్‌లో పాల్గొన్నారు. కజకిస్థాన్‌లోని అద్భుతమైన ప్రకృతి దృశ్యాల నేపథ్యంలో ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే యాక్షన్ బ్లాక్‌లో కనిపిస్తుండటంతో పాటు, అనిల్ రావిపూడి స్వయంగా ఈ సీక్వెన్స్‌ను పర్యవేక్షిస్తుండటంతో ఇది సినిమాలో ప్రధాన హైలైట్స్‌లో ఒకటిగా నిలవనుంది. ఈ కజకిస్థాన్ షెడ్యూల్‌లో వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటించే మరో గ్రాండ్ సాంగ్‌ను కూడా చిత్రీకరించనున్నారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్న ఈ ప్రత్యేక పాటను అందమైన లొకేషన్లలో తెరకెక్కించనున్నారు. ఇద్దరు హీరోల ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ పాట ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. భారీ యాక్షన్ సీక్వెన్స్, గ్రాండ్ సాంగ్.. వీటికి తోడు అందమైన కజకిస్థాన్ లొకేషన్లలో వెంకటేష్, కళ్యాణ్ రామ్‌ల సందడి ప్రేక్షకులకు విజువల్ ఫీస్ట్‌గా నిలవనుంది. తాజాగా విడుదల చేసిన వర్కింగ్ స్టిల్‌లో కజకిస్థాన్‌లోని అందమైన పర్వత ప్రాంతాల నేపథ్యంలో వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి ఉత్సాహంగా కనిపిస్తున్నారు. కళ్యాణ్ రామ్ గ్రే కలర్ క్యాజువల్ టీషర్ట్, బ్రౌన్ బాంబర్ జాకెట్, క్యామఫ్లాజ్ కార్గో ప్యాంట్, బ్లాక్ షూస్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. వెంకటేష్ డార్క్ టీషర్ట్‌పై ఆలివ్ గ్రీన్ జాకెట్, క్యామఫ్లాజ్ కార్గో ప్యాంట్, గ్రే స్నీకర్స్‌తో రగ్గడ్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఇద్దరూ సన్‌గ్లాసెస్‌తో కూల్ అండ్ అడ్వెంచరస్ లుక్ తో ఆకట్టుకున్నారు. అనిల్ రావిపూడి తనదైన ఎంటర్‌టైన్‌మెంట్‌కు యాక్షన్, డ్యాన్స్‌ను జోడిస్తూ తెరకెక్కిస్తున్న ఈ సినిమా కజకిస్థాన్ షెడ్యూల్‌తో మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పనిచేస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్‌గా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్ కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన హీరోల ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం జనవరి 12న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సంక్రాంతికి ప్రత్యేక ఆకర్షణగా 'జనవరి 12 విడుదల' ప్రేక్షకుల ముందుకు రానుంది.

మహాకాళి' నుంచి సినిమా ఫస్ట్ సాంగ్ 'అయిగిరి నందిని'



ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో, ఆర్‌కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (PVCU) నుంచి వస్తున్న చిత్రమిది. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భూమి శెట్టి, అక్షయ్ ఖన్నా, శ్రీయా రెడ్డి, రోహిత్ సారఫ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అయిగిరి నందిని' ని విడుదల చేసి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను భక్తి భావంతో ప్రారంభించారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు రచించి, స్వరపరిచిన మహాకాళి అమ్మవారికి అంకితమైన ఈ శాశ్వత స్తోత్రాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన ఈ పాట భక్తి భావం, పవర్ ఫుల్ వాయిస్, అద్భుతమైన విజువల్ స్టోరీటెల్లింగ్‌తో ఆకట్టుకుంటోంది. సంగీత దర్శకుడు స్మరణ్ సాయి ఈ ఐకానిక్ భక్తి గీతాన్ని సరికొత్తగా ఆవిష్కరించిన తీరు అద్భుతంగా వుంది. ఆధ్యాత్మికతను ఏమాత్రం తగ్గించకుండా, అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో పాటకు గ్రాండ్ మ్యూజికల్ స్కేల్ తీసుకొచ్చారు. పాట క్రమంగా ఇంటెన్స్ పెంచుకుంటూ, దైవిక నేపథ్యానికి చక్కగా సరిపోయే గొప్ప సంగీత అనుభూతిని అందిస్తోంది. అనిలా రాజీవ్, గీతా మాధురి, సాయి చరణ్ పవర్ ఫుల్ వాయిస్ పాటకు ప్రాణం పోశారు. విజువల్ పరంగానూ ఈ పాట ఎంతో ఆకట్టుకుంటోంది. మహాకాళి అమ్మవారి పాత్రలో శ్రీయా రెడ్డి అద్భుతమైన రూపంలో కనిపించారు. మహాకాళి అమ్మవారి దివ్య రూపంలో ఆమె కనిపించిన తీరు విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ విజువలైజేషన్‌లో అత్యంత అందమైన అంశం అమ్మవారిని మాతృమూర్తిగా చూపించిన విధానం. ఉగ్రరూపంలో దర్శనమిస్తూనే ఒక పసిబిడ్డకు పాలిస్తున్నట్లుగా అమ్మవారిని చూపించడం ఎంతో ప్రత్యేకంగా ఉంది. చెడును సంహరించే అపారమైన శక్తి, తల్లిగా అంతులేని కరుణ.. అమ్మవారిలోని ఈ రెండు అద్భుతమైన కోణాలను ఈ సన్నివేశం చక్కగా ఆవిష్కరిస్తోంది. శ్రీయా రెడ్డి పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ పాటలోని భక్తి భావాన్ని మరింత పెంచింది. స్మరణ్ సాయి అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్, గాయకుల ఎనర్జిటిక్ గానం, మహాకాళి అమ్మవారి గ్రాండ్ విజువల్ ప్రజెంటేషన్ కలిపి ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించే, గూస్‌బంప్స్ మూమెంట్స్ అందిస్తున్నాయి. సంగీతం, విజువల్స్ సమన్వయంతో 'అయిగిరి నందిని' పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం అందిస్తుండగా, సురేష్ రగుటు సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. 'అయిగిరి నందిని' పాటతో 'మహాకాళి' మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ అద్భుతంగా ప్రారంభించారు. ఈ చిత్రం 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది. -నటీనటులు: -భూమి శెట్టి, అక్షయ్ ఖన్నా, రోహిత్ సారఫ్

రామాయణం' అద్భుతమైన బిగ్ స్క్రీన్ ఎక్స్‌పీరియెన్స్.. ప్రశంసలు కురిపించిన దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి

'రామాయణం' థియేటర్లలోకి రావడంతో ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. గ్రాండ్ స్టోరీటెల్లింగ్, నటీనటుల అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌లు, సాంకేతిక విలువలపై ప్రేక్షకులు, విమర్శకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ సినిమాపై ప్రశంసలు కురిపించడం చిత్రానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. భారతీయ సినిమాను తనదైన భారీ కథాకథనాలతో కొత్త స్థాయికి తీసుకెళ్లిన రాజమౌళి.. నితేశ్ తివారీ తెరకెక్కించిన ఈ ప్రతిష్ఠాత్మక ఎపిక్ చిత్రాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా సినిమా భారీ స్థాయి, బిగ్ స్క్రీన్‌పై విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సినిమా అందించే గ్రాండ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను కొనియాడుతూ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "'రామాయణం' సినిమా భారీ స్థాయి, బిగ్ స్క్రీన్‌పై దాని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. రాముడిగా రణ్‌బీర్ కపూర్, ముఖ్యంగా వనవాసం నుంచి ఎంతో అద్భుతమైన ఔన్నత్యంతో కనిపించారు. రావణుడిగా యశ్ ప్రజెన్స్ అద్భుతంగా వుంది. సీతగా సాయి పల్లవి ఎంతో హుందాగా కనిపించారు. ప్రీ-క్లైమాక్స్, క్లైమాక్స్ నాకు ఎంతగానో నచ్చాయి. సినిమాలోని ప్రతి అంశాన్ని ఆస్వాదించాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన విజన్‌ను అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన నమిత్ మల్హోత్రా, నితేశ్ తివారీతో పాటు మొత్తం చిత్ర బృందానికి అభినందనలు" అని రాజమౌళి తన పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన అందుకుంటున్న 'రామాయణం' కు రాజమౌళి ప్రశంసలు మరింత ప్రత్యేకత తీసుకొచ్చింది.

నాన్న కుట్టి' సినిమా నుంచి 'నాలోన నే లేను' సాంగ్ రిలీజ్

వెర్సటైల్ హీరో విజయ్ ఆంటోని ప్రస్తుతం 'నాన్న కుట్టి' అంటూ ఆడియెన్స్‌ని మెప్పించేందుకు రెడీ అయ్యారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ము. మారన్ దర్శకత్వంలో ఈ చిత్రం రాబోతోంది. ఈ సినిమాకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీని నవంబర్ 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, సాంగ్స్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో బజ్‌ను పెంచేశాయి. తాజాగా ఈ చిత్రం నుంచి లవ్, మెలోడీ సాంగ్‌ను విడుదల చేశారు. 'నాలోన నే లేను' అంటూ సాగే ఈ లవ్ సాంగ్ అందరినీ కట్టి పడేసేలా ఉంది. అమ్మాయి కోణంలోంచి సాగే ఈ సాంగ్ వన్ సైడ్ లవ్‌లోని స్వీట్‌నెస్‌ను చూపించేలా ఉంది. విజయ్ ఆంటోని బాణీ.. భాష్య శ్రీ సాహిత్యం.. రుక్షర్ బంధుకియా గాత్రం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వీడియో సాంగ్‌లో ప్రతీ అస్రానీ అందం, విజువల్స్ హైలెట్‌గా నిలిచాయి. ఈ పాటలోస్కూల్ టీచర్‌గా ప్రీతి అస్రానీ ఎంతో నేచురల్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. రాజీవ్ రాజేంద్రన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేయగా, విజయ్ ఆంటోనీ సంగీతం అందించడంతో పాటు ఎడిటర్‌గా కూడా వ్యవహరించారు. ఎ. రాజా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తించారు. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, భావోద్వేగ కథనం, హృద్యమైన సంగీతం, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో 'నాన్న కుట్టి' చిత్రం రానుంది. నవంబర్ 20న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం* : విజయ్ ఆంటోని, ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, -లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు

G.O.A.T (గోట్) మూవీ ట్రైలర్‌ను విడుదల చేసిన దుల్కర్ సల్మాన్

- ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్) GreatestOfAllTimes అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా



నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ తన సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి.. చిత్ర టీమ్‌కు శుభాకాంక్షలు అందజేశారు.. నిర్మాత మాట్లాడుతూ ''సుడిగాలి సుధీర్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెతో నిర్మించిన చిత్రమిది. ఆయన క్రేజ్‌కు తగ్గ కథను ఎన్నుకుని ఈ సినిమా నిర్మించాను. ఆయన పాత్ర నేటి యువత కనెక్ట్ అవుతుంది. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆడుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మి సాయి, నవీన్ నేని, తదితరులు నటిస్తున్న ఈ -చిత్రానికి ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, నేపథ్య సంగీతం: మణిశర్మ, డీఓపీ: రసూల్ ఎల్లోర్, ఆడిషనల్ డీఓపీ: సన్నీ కూరపాటి, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, , కో ప్రొడ్యూసర్: సమైరా రెడ్డి.ఎన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ, దర్శకత్వం: వేదవ్యాస్, నిర్మాత: చంద్రశేఖర్ మొగుళ్ళ

సమ్మర్ హాలిడేస్" సినిమా మిమ్మల్ని ఏమాత్రం నిరాశపర్చదు,

- ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని



కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ -లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేబి ఖుషి మాట్లాడుతూ - "సమ్మర్ హాలిడేస్" మంచి ఫీల్ గుడ్ మూవీ. పిల్లలతో పాటు పెద్దవాళ్లకు కూడా బాగా నచ్చుతుంది. ఎంటర్ టైన్ మెంట్ తో మా మూవీ సాగుతూనే మంచి మెసేజ్ కూడా అందిస్తుంది. ప్రతి ఒక్కరూ నోట్లాల్జిక్ గా ఫీలవుతారు. అరుణ్, రోహన్ సెట్ లో చాలా సరదాగా ఉండేవారు. వారితో కలిసి నటించడం హ్యాపీగా అనిపించింది. ఈ సినిమాలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్ గారికి థ్యాంక్స్. అన్నారు. మాస్టర్ రోహన్ మాట్లాడుతూ - నేను నటుడిగా కెరీర్ కొనసాగించేందుకు అమ్మ చాలా కష్టపడుతోంది. ఈ సినిమా కోసం నేను ఎక్కడికి జర్నీ చేయాలన్నా అమ్మే అన్నీ చూసుకునేది. ఈ కథ మా అమ్మకు బాగా నచ్చింది. నేను ఈ సినిమాలో నటించాను అంటే కారణం మా అమ్మే. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చి మంచి విజయం సాధిస్తే నాకు నటుడిగా గుర్తింపు వస్తుంది. నా కష్టానికి తగిన ఫలితం దక్కిందని భావిస్తా. అన్నారు. మాస్టర్ అరుణ్ మాట్లాడుతూ - "సమ్మర్ హాలిడేస్" స్టోరీ నాకు బాగా నచ్చింది. ఇందులో ఫ్రెండ్షిప్ వ్యాల్యూస్ గురించి బాగా చెప్పారు. ఇప్పుడు చిన్నచిన్న విషయాలకే స్నేహితులు విడిపోతున్నారు. 90's స్నేహితులు ఎంత బాగా కలిసి ఉండేవారు అనేది ఈ సినిమాలో నటించేప్పుడు తెలుసుకున్నాను. ఒక ఫ్రెండ్ కోసం మరో ఫ్రెండ్ ఎంత కష్టపడేవాడు అనేది ఈ కథలో నన్ను ఆకట్టుకుంది. అన్నారు. డైరెక్టర్ శ్రీకర్ నయన్ మాట్లాడుతూ - మా సమ్మర్ హాలిడేస్ సినిమా బిగిన్ చేసినప్పటి నుంచి పాజిటివ్ వైబ్ తోనే వర్క్ చేస్తున్నాం. రిలీజ్ వరకు కూడా అదే పాజిటివ్ వైబ్ మా అందరిలో ఉంది. ఫస్ట్ నేను రాసుకున్న రెండు లైన్ల స్టోరీ ఇది. అది కొన్ని పేజీల కథగా మారి, 120 నిమిషాల సినిమాగా మీ ముందుకు వస్తోంది. నేను అనుకున్న కథకు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి ఎంటర్ టైనింగ్ మూవీ చేశాము. స్క్రీన్ మీద మా మూవీ కాపీ చూస్తుంటే చాలా సంతృప్తిగా అనిపించింది. మీరు కూడా మా సినిమాను థియేటర్ లో చూస్తున్నప్పుడు హ్యాపీగా ఫీలవుతారు. సినిమా కంప్లీట్ అయి బయటకు వస్తున్నప్పుడు మంచి సినిమా చూశామనే సంతృప్తి మీలో కలుగుతుంది. కోర్ట్ లాంటి సినిమాను కథగా చెప్పి ఒప్పించడం కష్టం. అలాంటి సినిమాలు దర్శకుడిగా నాకు స్ఫూర్తినిచ్చాయి. మా సినిమాలోని 115 నిమిషాల్లో ప్రతి నిమిషాన్ని మీరు ఎంజాయ్ చేస్తారు. ఒక్క నిమిషం కూడా బోర్ ఫీల్ అవ్వరు. అన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ - పిల్లలకు మార్కులు, ర్యాంకులు రాకపోతే లైఫ్ లేదు అనుకుంటున్నాం. కానీ జీవితంలో మనం ఏం చేసినా ధైర్యంగా నిలబడాలి, కాన్ఫిడెంట్ గా చేయాలని మంచి విషయాన్ని ఈ సినిమాలోని రోహన్ పాత్ర ద్వారా చెబుతున్నాం. నగరంలో పెరిగే అరుణ్ అనే అబ్బాయికి చదువే లోకం, తన ఫ్రెండ్స్, కుటుంబం చాలా చిన్నది. అలాంటి అబ్బాయి సమ్మర్ హాలీడేస్ కు అమ్మమ్మ ఊరికి వెళ్తాడు. అక్కడ రోహన్ పరిచయంతో అరుణ్ తన లైఫ్ లో ఎన్నో విషయాలు తెలుకుంటాడు. లైఫ్ లో ఎలాంటి సందర్భం వచ్చినా నిలబడి గెలవొచ్చు అనే ధైర్యాన్ని రోహన్ ను చూసి నేర్చుకుంటాడు అరుణ్. రోహన్ క్యారెక్టర్ ఎంత అల్లరిగా ఉన్నా, అతని లైఫ్ లో ఒక స్ట్రగుల్ ఉంటుంది, ఒక పెయిన్ ఉంటుంది. ఇవన్నీ తను ఎలా ఓవర్ కమ్ అయ్యాడు అనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా. మనలో ఒక చైల్డ్ ఉంటాడు. ఈ సినిమా చూశాక మన చైల్డ్ హుడ్ ను గుర్తుకుతెచ్చుకుంటాం. ప్రతి ఒక్కరూ తన చిన్ననాటి స్నేహితుల్ని కలవాలని అనుకుంటారు. మనకు మన గ్రాండ్ పేరెంట్స్ ను గుర్తుచేస్తుందీ సినిమా. ఒకట్రెండు రోజులు వారితో గడిపితే ఎంత సంతోషంగా ఉంటారు అనేది ఈ మూవీ తెలియజేస్తుంది. మా సినిమా లక్షమంది చూస్తారో, పది లక్షల మంది చూస్తారో తెలియదు. కానీ ఒక్కరు కూడా డిజప్పాయింట్ కారు అని చెప్పగలను. మా సినిమా చూసి బరువెక్కిన గుండెతో థియేటర్ నుంచి బయటకు వస్తారు. మంచి మెమొరీస్ రీకాల్ చేసుకుంటారు. సినిమా చూసిన తర్వాత కొన్ని రోజుల పాటు మీ మెమొరీస్ లోనే మా మూవీ ఉండిపోతుంది. 200 పర్సెంట్ మంచి సినిమా చేశాం. మంచి సినిమాలను తెలుగు ఆడియెన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ దీపావళికి ఫ్యామిలీతో మా సినిమాకు రండి మిమ్మల్ని తప్పకుండా ఎంటర్ టైన్ చేస్తాం. అన్నారు. నటీనటులు - రోహన్ రాయ్, అరుణ్, ఖుషి, జయసుధ, రాజీవ్ కనకాల, వాసుకి, హర్షిణి, హర్షవర్ధన్, తదితరులు

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com